మన స్వయంపాలన దేశానికే ఆదర్శం

అమరులకు అదే నిజమైన నివాళి: బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్

ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వరాష్ట్రమై పదేండ్లు పూర్తిచేసుకున్న చారిత్రక సందర్భం లో రాష్ట్ర సాధన కోసం సాగిన పోరాటాలు, త్యాగాలను స్మరించుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన దశాబ్ది వేడుకలను ముగించుకునే సందర్భంలో అమరులకు ముందుగా నివాళి అర్పిద్దామని పేర్కొన్నారు. ప్రజాస్వామిక వాతావరణంలో పార్లమెంటరీ పంథాలో బీఆర్ఎస్ పార్టీ అస్థిత్వ రాజకీయ వేదికగా ప్రజలందరి భాగస్వామ్యంతో తెలంగాణ సాధించుకున్నామని తెలిపారు. రాష్ట్ర సాధనకోసం భావజాలవ్యాప్తి సాగించి తెలంగాణ స్వరాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను సకలజనులకు బోధించి, పోరాటంలో సబ్బండ వర్గాలను సమీకరించి అనేక వ్యూహాలను, ఎత్తుగడలను అమలుపరిచి కేంద్రాన్ని కదిలించి, తెలంగాణకు సానుకూలంగా దేశంలోని మెజారిటీ రాజకీయ పార్టీలను ఒప్పించి, తెలంగాణ స్వరాష్ట్రాన్ని సాధించిన చారిత్రక సందర్భాలను కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. అనేక త్యాగాలకోర్చి సాధించుకున్న తెలంగాణను అన్నిరంగాల్లో పటిష్ట పరుచుకుంటూ సమర్థవంతంగా పాలనను అందించిన పదేండ్ల స్వయంపాలనా కాలం దేశానికి అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో తెలంగాణను ఒక రోల్ మోడల్‌గా నిలిపిందని పేర్కొన్నారు. అమరుల త్యాగాలను వృథా పోనీయకుండా ప్రజల భాగస్వామంతో సాధించిన ప్రగతిని, ప్రజాసంక్షేమాన్ని నేటి ప్రభుత్వం కొనసాగించాలని ఆకాంక్షించారు.

రాగద్వేషాలకు తావివ్వకుండా

బాధ్యతతో, చిత్తశుద్ధితో, వ్యక్తిగత ద్వేష భావనలకు తావివ్వకుండా తెలంగాణ సమాజ ప్రగతి, సంక్షేమమే లక్ష్యంగా బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన నిజమైన ప్రజాసంక్షేమ పాలన స్ఫూర్తినందుకొని ముందుకుసాగడం ద్వారానే ప్రస్తుత ప్రభుత్వం అమరుల ఆకాంక్షలను నెరవేర్చగలదని కేసీఆర్ పేర్కొన్నారు. అమరుల త్యాగాలను స్మరించుకుంటూ వారికి ఘన నివాళి అర్పించేందుకు శనివారం కొనసాగిన అమరజ్యోతుల (కొవ్వొత్తుల) ర్యాలీని విజయవంతం చేయడం పట్ల పార్టీ శ్రేణులకు, తెలంగాణ వాదులకు కేసీఆర్ అభినందనలు తెలిపారు. జూన్ 2, జూన్ 3 తేదీల్లో బీఆర్ఎస్ దశాబ్ది ఉత్సవాల ముగింపు వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని కేసీఆర్ పిలుపునిచ్చారు.

దశాబ్ది తెలంగాణ విజయదుందుభి

దగా పర్వాన్ని దాటుకుని రాష్ట్రంగా ధగధగలు

- ఆరు దశాబ్దాల పోరాటం.. పదేండ్ల అద్భుత ప్రగతి
- అతి చిన్నవయసు రాష్ట్రం అనేక రంగాల్లో అగ్రపథం
- రాష్ట్రావతరణ దశాబ్ది వేళ తెలంగాణ గమనం మననం



తెలంగాణ.. ఆగమైన రత్నవీణ
తెలంగాణ.. ఆగని అగ్నివాన!
తెలంగాణ.. అలుపెరగని పోరాట కోన!

అస్తిత్వం, ఆత్మగౌరవం కోసమే శతాబ్దాలుగా ఈ నేల నిలబడింది. తెగింపునకు, తిరుగుబాటుకు, త్యాగానికి ఈ గడ్డ ప్రతీక. ఆకలిని భరించినా.. ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తే ఊరుకోని పోరాటతత్వం తెలంగాణది. కానీ అమాయకత్వమే దాని బలహీనత. అందుకే రాచరికయుగాల మొదలు రాజకీయ మారీచుల వరకు అందరూ తెలంగాణను దగా చేసింద్రు. ధ్వంసం చేసింద్రు. తమ ప్రయోజనాల కోసం ఇక్కడి ప్రజలను దోచుకున్నరు. కత్తిగట్టిన ప్రాంతేతరులకు సద్దిగట్టిందీ స్థానికుడే. ఈ దగాపర్వంలో వంచితగా మిగిలిందే తప్ప.. తెలంగాణ ఏనాడూ నిస్తేజంలో పడిపోలేదు. తిరుగుబాటును ఆపలేదు. కుదిరితే కార్చిచ్చుగానో, లేనివేళల్లో కాగడాలాగనో, అదీ వీలుగాని నిర్బంధ వేళల్లో చిన్న నిప్పురవ్వగానో జ్వలిస్తూనే ఉన్నది. ఆధిపత్యంపై పోరాటం చేస్తూనే ఉన్నది. అస్తిత్వ పతాకం ఎగరవేస్తూనే ఉన్నది. తెలంగాణ ఓ సిల్‌సిలా.

పాములు, నిచ్చెనలతో నిండిన రాజకీయ పరమపద సోపానపటంలో పడిపోయిన ప్రతీసారి శక్తినంతా కూడగట్టుకొని పోరాడింది తెలంగాణ. గమ్యాన్ని ముద్దాడే క్రమంలో అందివచ్చిన నిచ్చెనమెట్లెన్నో! కాటేసిన కాలనాగులెన్నో! పోరాట పథం ప్రతి మలుపులో ఓ ప్రశ్న ఎదురయ్యేది. సమాధానం చెప్పి ఒప్పించగానే భేతాళుడు తిరిగి చెట్టెక్కేసేవాడు. మరో ప్రహేళిక.. మరో ప్రయత్నం.. మళ్లీ పోరాటం! క్యాలెండర్లు మారిపోయాయి. డెడ్‌లైన్లు దాటిపోయాయి. ఎన్నేసి ఎన్నికల్లో జనం సుస్పష్టంగా తీర్పునిచ్చినా.. ఏలికల నాలుక మాటిమాటికీ మడతపడేది. రాజకీయం పాచిక విసిరి.. మళ్లీ ఓ మెలిక పెట్టేది. నయానయవంచనకు సిద్ధమయ్యేది. వృద్ధ వ్యాఘ్రం ఇస్తానన్న బంగారు కంకణం ప్రత్యేక రాష్ట్రం. దాని ఆశజూపి బలగొన్న ప్రాణాలు తెలంగాణవి. ఆ ముసలిపులి కాంగ్రెస్!!

తెలంగాణ మళ్లీ ఇప్పుడు తనను తాను తడుముకుంటున్నది. పరాధీనతను వీడని మనుషుల చేష్టలను చూసి తల్లడిల్లుతున్నది. ఒళ్లంతా పచ్చినెత్తురు. నిలువెల్లా గాయాల గేయాలు. దశాబ్దాలుగా దగా చేసినవాళ్లే.. ప్రతి రస్తాలో దోఖా చేసినవాళ్లే.. ఇప్పుడు కొత్త కహానీలు వినిపిస్తున్నరు. నాటకం నడిపిస్తున్నరు. 'మేం ఇచ్చినం' అంటున్నరు. 'మేమే ఇయ్యుమని చెప్పినం' అంటున్నరు. 'అసలు మేమే లేకపోతే వస్తుండెనా?' అని కూడా అంటున్నరు. ఏదో తిజోరీలోంచి తీసి జోలెలో బిచ్చమేసినట్టు తమకు తామే త్యాగరాజులమని చిరతలు వాయిస్తున్నారు. జీవితంలో ఎన్నడూ 'జై తెలంగాణ' అననోళ్లు.. ఇప్పుడు తమంతటి ఉద్యమకారులు లేనేలేరని చంకలు గుద్దుకుంటున్నరు. తెలంగాణ గురించి అఆలు కూడా తెల్వనివాడు.. ఇవ్వాళ తెలంగాణ ఎలా ఉం డాల్నో నిర్ణయిస్తడట! తెలంగాణ కోసం ఒక పోరయుద్ధంతో సాక్షాత్కారమైన సామూహిక స్వప్నం! దేశ చరిత్రలో నిలిచిపోయే ఒక మహత్తర పోరాట చరిత్ర.

సమరాంగణమున సైంధవులెందరో..

పెద్ద మనుషుల ఒప్పందం పెద్ద దగా. దాని మాటున అమాయకపు తెలంగాణను ఆంధ్రా అల్లరి పిల్లవాడికి బలవంతంగా కట్టబెట్టిన కుతంత్రం తొందరలోనే ప్రజలకు తెలిసివచ్చింది. తెలంగాణకు ఉపముఖ్యమంత్రి పదవి ఆరోవేలు లాంటిదంటూ కాంగ్రెస్ కథ వినిపించినప్పుడే.. ఆ పార్టీ 'చెయ్యి'చ్చిందని తెలంగాణకు అవగతమైంది. తెలంగాణ నుంచి ముగ్గురు ముఖ్యమంత్రులైనా వారిని మూడేండ్లు కూడా ఉండనివ్వనప్పుడే.. కాంగ్రెస్ ధోకాబాజీ ప్రజలకు అర్థమైంది. ముల్కీని మూలకు నెట్టి కొలువులను కొల్లగొట్టినప్పుడు దాని కుట్ర తేటతెల్లమైంది. ఇక్కడ నిధులను దారిమళ్లించినప్పుడే దాని దోపిడీతత్వం బోధపడింది. గలగలా గోదారి, బిరాబిరా కృష్ణమ్మలను ఈ నేలను కాదని మలుపుకొన్నప్పుడే మన నీళ్లూ మింగేశారన్న నిజం తెలిసివచ్చింది. తెలంగాణ పోరాడింది దోపిడీదారుల పైనే కాదు, వాళ్లకు సహకరించిన సైంధవులపైన కూడా! ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసినప్పుడు.. నట్టనడిమిట్ల నమ్మించి గొంతుకోసిన కట్టప్పలపైన కూడా!

'ఇట్లీ–సాంబార్ గోబ్యాక్' అని నినదించిన హైదరాబాద్ సిటీకాలేజీ సాక్షిగా.. తూటాలకు ఆరుగురు బలైంది ఎవరి కుట్రలకు? దానికి కారకులెవరు? 'విశాలాంధ్రలో ప్రజారాజ్యమని' పంచనచేరినోళ్ల మోచేతి నీళ్లు తాగిందెవరు? బొంకి బోర్లేసిందెవరు? దొంగలకు సద్దిగట్టిన స్థానికులెవరు? 'మీది కుండ మీదనే ఉండగానే కింది కుండను మాయం చేసినట్టు' నెత్తురు ధారపోసినట్టు.. సర్వస్వం త్యాగం చేసినట్టు కలరింగులు ఇస్తూ కొందరు కొత్త కొత్త సిద్ధాంతకర్తలు స ర్కారీ గద్దెల మీద రాగాలాపన చేస్తున్నారు. కిరాయివాణి వినిపిస్తున్నరు. దశాబ్ద కాలంగా తెలంగాణ ఏం సాధించిందో, ఎంతటి శిఖరాలకు చేరుకున్నదో కండ్ల ముందు వెలుగులీనుతూ కనిపిస్తున్నా.. చూడలేని అంధ మేధోమూకలు ఇప్పుడేదో అద్భుతాలు జరిగినట్టు తెగ సంబరాల్లో మునిగి తేలుతున్నారు. పేగులు తెగేదాక కొట్లాడినోళ్లకు.. పేగులు మెడలో వేసుకుని తిరుగుతామన్నోళ్లకు మధ్య తేడాను తెలంగాణ సమాజం ప్రస్తుతం చూస్తున్నది.

తెలంగాణ.. ఎవరో ఇస్తే పుచ్చుకున్న బిచ్చం కాదు. పోరాడి సాధించిన హక్కు! నూనూగుమీసాల యువకుల బలిదానాలతో సిద్ధించిన వరం! ఎత్తుకు పైఎత్తులతో శత్రువును చిత్తు చేసిన తెలంగాణ రాజకీయ చాణక్యం! ఎత్తిన జెండా దించకుండా దారిలో రాళ్లను, ముళ్లను లెక్కచేయకుండా.. కుట్రల కత్తుల వంతెనపై మడమ తిప్పని పోరా టం! కొలువులను కొల్లగొడుతుంటే కండ్లుమూసుకున్నదెవరు? 1969కి కారకులెవరు? 369 మందిని పొట్టనపెట్టుకున్నదెవరు? 14గింట 11 మంది ఎంపీలను పార్లమెంట్‌కు పంపితే మసిపూసి మారేడుకాయ చేసిందెవరు? ప్రజాస్వామిక ఆకాంక్షను నియంతలై తొక్కిందెవరు..? పెద్దమనుషుల ఒప్పందాన్ని అటకెక్కించిందెవరు? ఆరుసూత్రాలను ఆగం జేసిందెవరు? 'జై తెలంగాణ'కు పోటీగా 'జై ఆంధ్రా'ను లేవదీసిన కుతంత్రపు సృష్టికర్తలెవరు?

కటిక నిజాలు.. చీకటి కోణాలు

తెలంగాణ. ఇవ్వాళ 'కట్టిన ఇల్లు.. పెట్టిన పొయ్యి'. ఎన్నయినా మాట్లాడొచ్చు. ఎన్ని నిందలైనా వేయొచ్చు. కానీ, నిజం కండ్ల ముందున్నది. 1952 పోలీస్ కాల్పులనుంచి 1969లో పండల మంది ఊచకోత వరకు ఉద్యమం సాగినా తెలంగాణ ఎందుకు రాలేదు? ఉద్యమాన్ని మధ్యలోనే వదిలేసి.. ఆకాంక్షలను అణగదొక్కిన కుట్రదారులెందరు? నమ్ముకున్న ప్రజల గొంతుకోసి ఢిల్లీ పాదుషాల ముందు పాదాక్రాంతమైన కాలాంతకులెందరు? కరడుగట్టిన సమైక్యవాదినీ మనవాడిగా, మహానుభావుడిగా చిత్రీకరించిన మీడియా ఎవరిది? సంఘర్షణలోనూ, సందిగ్ధావస్థలోనూ, స్తబ్ధతలోనూ చేతులు అడ్డుపెట్టి, దోసిలిమూసి తెలంగాణ వాదమనే జ్యోతిని కాపాడిందెవరు? 2001 మలిదశ ఉద్యమంతోనే రాష్ట్రసాధన ఎలా సాధ్యమైంది? ఎన్ని త్యాగాలు, ఎన్ని సవాళ్లకు ఎదురు నిలిస్తే స్వప్నం సాకారమైంది? ఎన్ని అడ్డంకులు దాటితే మార్గం సుగమమైంది? ఎంత రాజకీయ చాణక్యం, చైతన్యం కలగలిపి నడిస్తే గమ్యం చేరువైంది? రాజకీయ అనివార్యతతోనే రాష్ట్రం సిద్ధిస్తుందని విశ్వాసం పాదుకొల్పిందెవరు? గత వైఫల్యాలనే పునాది చేసుకొని ఒక్కో దశలో ఒక్కో వ్యూహంతో ఉద్యమ స్ఫూర్తిని గ్రామగ్రామాన రగిల్చి ఉద్యమాన్ని లక్ష్యానికి చేర్చిన చతురత ఎవరిది? సబ్బండ వర్ణాలను సమన్వయం చేసి, జాతీయస్థాయిలో మద్దతును కూడగట్టిన వ్యూహమెట్టిది? తెలంగాణ ఇవ్వకుండా ఉండలేని అనివార్యతను సృష్టించిందెవరు? గల్లీ నుంచి ఢిల్లీ దాక.. ఆర్ఎస్‌యూ నుంచి ఆర్ఎస్ఎస్ దాక.. తెలంగాణ కాజ్ కోసం కదిలించిందెవరు? ముందుకు నడిపించిన చోదకశక్తి ఏది? ఎన్నిసార్లు రాజీనామాలు! ఎన్ని ఎన్నికలు! ఎన్ని సభలు! ఎట్లాంటి ఉద్యమం! ఎంతటి ఉద్వేగం!

చారిత్రక విభాత సంధ్యల తెలంగాణ పయనమెట్టిది?
అర్పించిన ప్రాణాలెన్ని? కనిపించని కోణాలెన్ని?
సుదీర్ఘ ఉద్యమంలో మెరుపులెన్ని? మరకలెన్ని?
గోదాలోకి దిగి పోరాడిందెవరు?
చెట్టుచాటున నక్కి బాణాలేసిందెవరు?
అట్టుడుగున పడి కాన్పించని కథానాయకులెవరు?
పసికూన రాష్ట్రం పసిడి తెలంగాణగా మారిందెట్లా?
రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల వేళ..

తెలంగాణ ప్రస్థానంపై ప్రత్యేక కథనాలు 'నమస్తే తెలంగాణ'లో.. త్వరలో..

పదఘట్టనల కింద పడి నలిగిన తెలంగాణ

తెలంగాణ వొడవని ముచ్చట. తీరని దుఃఖం. దశాబ్దాలపాటు జరిగిన విధ్వంసానికి నీళ్లకు బదులు నెత్తురు కారని కన్ను ఉన్నదా తెలంగాణ గడ్డమీద? భంగపడని బతుకు ఉన్నదా ఈ నేలన? చెరువును చెరబట్టినవాళ్లు...ఊరును ఛిద్రం చేసినవాళ్లు...పాటను ముక్కలు చేసినవాళ్లు.. నోరును నొక్కేసినవాళ్లు.. పిడికిళ్లను పలుగదీసినవాళ్లు.. ఎంత అణచివేత! ఎంతటి అరాచకీయం!

తలాపున నదులు పారుతున్నా కరువు కమ్మేస్తే కడుపులో కాళ్లుముడుసుకున్న పల్లెలు! మెతుకు వెతుకులాటలో ఊరూరా వలసబాట! బొంబాయి.. దుబాయి.. బొగ్గుబాయి! తరాలుగా తెలంగాణ తండ్లాట ఇదే కదా! తండ్రులే కొడుకులకు తలకొరివి పెట్టే గడ్డగా తెలంగాణ ఎందుకు పిలువబడింది? ఎంత వ్యథ! ఎంతటి గుండెకోత!

అంతటి నిస్సహాయతలో, నీరవనిశ్శబ్దంలో, నిర్బంధంలో తెలంగాణ రాజకీయ పార్టీని కలగన్నది. తెలంగాణ రాష్ట్ర సమితి రూపంలో ఆత్మగౌరవ ఆకాంక్షను ఆకాశమంత ఎత్తుకు తీస్కపోయే జెండా ఒకటి ఎగిరింది. కేసీఆర్ రూపంలో తెలంగాణ సమాజానికి నమ్మిక కుదిరింది. బక్కపలచని యుద్ధభేరి మోగింది. కేసీఆర్ అనే మూడక్షరాలు.. దగాబడ్డ తెలంగాణకు గుండె ధైర్యాన్నిచ్చింది. అప్పటిదాక ఆయనెవరో ఉమ్మడి మెదక్ జిల్లా మినహా తెలంగాణ ప్రజలకు పెద్దగా తెలియదు. ఆర్థికంగా పరిపుష్టి ఉన్న నాయకుడు కూడా కాదు. సినీ గ్లామర్ లేదు. మీడియా మద్దతు లేదు. అన్నింటికి మించి ప్రత్యర్థులుగా ఇద్దరు బలమైన నాయకులు (చంద్రబాబు, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి). ఇలాంటి ప్రతికూలతల మధ్య 'జై తెలంగాణ' నినాదం ఎత్తుకున్నారు. డిప్యూటీ స్పీకర్ (మంత్రి హోదా), ఎమ్మెల్యే పదవి, టీడీపీ ప్రాథమిక సభ్యత్వానికి ఇలా ఏకకాలంలో మూడు పదవులకు రాజీనామా చేయటం ద్వారా 'పదవుల కోసం రాజకీయాల్లోకి వచ్చిన నాయకుడు కాదు కేసీఆర్' అని ప్రజల్లో బలమైన విశ్వాసాన్ని కల్పించారు. తెలంగాణ చర్చకు తిరిగి ప్రాణంపోశారు. పదవుల కోసమో..మరో దానికోసమో ఉద్యమం నుంచి పక్కకు జరిగితే'నన్ను రాళ్లతో కొట్టిచంపండి' అని పిలుపునిచ్చారు. సమకాలీన భారత దేశ చరిత్రలో అలా చెప్పగలిగిన, అలాగే నడిచిచూపిన నాయకులు ఇంకెవరైనా ఉన్నారా?

చెప్పులు క్యూలో పెడితే విత్తనాలు వస్తయా?

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లాలంటే ఎన్నికల కమిషన్ అనుమతి అవసరమని, అందుకే తాను అక్కడికి వెళ్లలేకపోయానని తెలిపారు. గన్‌పార్క్ వద్ద ఎక్కడా ముళ్లకంచెలు వేయలేదని స్పష్టం చేశారు. సమ్మక్క, సారలమ్మను చంపిన రాజులుగానే కాకతీయులను చూస్తానని, అందుకే తాను సమ్మక్క, సారలమ్మవైపే ఉంటానని తేల్చిచెప్పారు. తెలంగాణ చిహ్నంలో కాకతీయ తోరణం తీసివేస్తారనే ప్రచారంపై విలేకరులు ప్రశ్నించగా సీఎం పైవిధంగా స్పందించారు. 'జయ జయహే తెలంగాణ' రాష్ట్ర గీతంపై అన్ని విషయాలను అందెశ్రీ మాత్రమే చెప్పాలని పేర్కొన్నారు. సచివాలయం లోపల తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. సచివాలయం నుంచే బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తామని, తొలుత సీఎం, సీఎస్‌లకు అమలు చేసి ఆ తర్వాత కిందిస్థాయి ఉద్యోగులకు అమలు చేస్తామని వివరించారు. అమరవీరులను గుర్తించేందుకు ప్రత్యేకంగా కమిటీ వేస్తామని, వారి కుటుంబాలకు న్యాయం చేస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర అవతరణ వేడుకలకు అన్ని పార్టీలను ఆహ్వానించినట్టు తెలిపారు. బీజేపీని విస్మరించలేదని పేర్కొన్నారు. భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ అవతరణ వేడుకలకు కేసీఆర్ రావాలని కోరారు.

పాకిస్థాన్ చేసుకున్నట్టు ముందే వేడుకలు

భారతదేశ స్వాతంత్ర్యం విషయంలో పాకిస్థాన్ ఒకరోజు ముందుగానే వేడుకలు చేసుకుంటున్నట్టు కేసీఆర్ కూడా ఒక రోజు ముందే వేడుకలు చేస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు తన నేతృత్వంలో జరగడం తనకు జీవితకాలపు గుర్తు అని పేరొన్నారు.

కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారం

ఎగ్జిట్ పోల్స్ ఎలా ఉన్నప్పటికీ కేంద్రంలో ఇండియా కూటమిదే అధికారమని రేవంత్ ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్రంలోనూ కాంగ్రెస్ పార్టీ 9–10 ఎంపీ స్థానాలు, రెండు ఎమ్మెల్సీలు, ఒక ఎమ్మెల్యే స్థానంలో గెలుస్తున్నట్టు తెలిపారు. ఒకవేళ అనుకున్న ఫలితాలు రాకపోతే మరో రెండు గంటలు ఎక్కువగా పనిచేస్తానని పేర్కొన్నారు. తమ 100 రోజుల పాలన రెఫరెండంపైనే ఓట్లు పడ్డాయని తెలిపారు. త్వరలోనే టీపీసీసీ అధ్యక్షుడిగా తన పదవీకాలం ముగుస్తుందని, ప్రముఖ నాయకుడే కొత్త అధ్యక్షుడు అవుతారని స్పష్టం చేశారు. పీసీసీ అధ్యక్షుడి ఎంపికలో అధిష్ఠానానిదే ఫైనల్ నిర్ణయమని తేల్చి చెప్పారు.

రైతుభరోసాపై అసెంబ్లీలో నిర్ణయం

రైతుభరోసా అమలుపై అసెంబ్లీలో చర్చించి అందరి అభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకుంటామని సీఎం తెలిపారు. అర్హులైన రైతులకు మాత్రమే రైతుభరోసా ఇస్తామని తేల్చిచెప్పారు. కాళేశ్వరం, మేడిగడ్డపై ఎన్డీఎస్ఏ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఫోన్ ట్యాపింగ్‌పై కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి ఎందుకు చర్యలు తీసుకోలేకపోయారని ప్రశ్నించారు. రాష్ట్రంలో విద్య, క్రీడలను ప్రోత్సహించేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. బీసీ కులగణన చేసేందుకు ఇప్పటికే ఆదేశాలు జారీచేశామని, త్వరలోనే దీన్ని ప్రారంభిస్తామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం మొదటి ప్రాధాన్యం డ్రగ్స్‌ను కంట్రోల్ చేయడమేనని తెలిపారు. కొత్త మద్యం బ్రాండ్లపై స్పందించిన సీఎం గతంలో కేసీఆర్ 80 కొత్త బ్రాండ్లకు అనుమతి ఇచ్చారని పేర్కొన్నారు.



గవర్నర్ రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి

ఆవిర్భావ వేడుకలకు గవర్నర్‌కు ఆహ్వానం

స్వయంగా ఆహ్వానించిన సీఎం, డిప్యూటీ సీఎం

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రావాల్సిందిగా గవర్నర్ రాధాకృష్ణన్‌ను సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆహ్వానించారు. ఈ మేరకు శనివారం ఉదయం వారిద్దరు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసి వేడుకలకు రావాల్సిందిగా కోరారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను, కార్యక్రమాలను గవర్నర్ అడిగి తెలుసుకున్నట్టు సమాచారం. సుమారు 30 నిమిషాలపాటు గవర్నర్‌తో భేటీ అయిన సీఎం, డిప్యూటీ సీఎం పలు అంశాలపై చర్చించినట్టు తెలిసింది. ముఖ్యంగా యూనివర్సిటీలకు వీసీల నియామకంపై చర్చించినట్టు సమాచారం. ఇందుకు సంబంధించి ఇప్పటికే తీసుకున్న చర్యల్ని గవర్నర్‌కు వివరించినట్టు తెలిసింది.

హనుమకొండ జిల్లా కేయూ గేటు వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తే ఊరుకోం

కేయూ మొదటి గేటు వద్ద బీఆర్ఎస్వీ ఆందోళన

హనుమకొండ చౌరస్తా/హనుమకొండ/ఖిలావరంగల్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర రాజముద్ర నుంచి కాకతీయ కళాతోరణం తొలగింపును వ్యతిరేకిస్తూ శనివారం కేయూ మొదటి గేటు వద్ద కాకతీయ యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్‌చంద్ర మాట్లాడారు. తెలంగాణ రాజముద్రలో కాకతీయ తోరణాన్ని తొలగించడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని పేర్కొన్నారు. తెలంగాణ రాజముద్రను మార్చొద్దని బీఆర్ఎస్ మైనార్టీ నాయకుడు నయూమొద్దీన్ పలువురు మైనార్టీ నాయకులతో కలిసి బాలసముద్రంలో సీఎం రేవంత్‌రెడ్డికి పోస్ట్‌కార్డులు పంపించారు. తెలంగాణ ప్రభుత్వం రాజముద్రను తొలగిస్తే ఓరుగల్లు ప్రజలను అవమానించినట్టేనని టీడీపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఠాకూర్ గణేశ్‌సింగ్ అన్నారు. తోరణం తొలగింపుపై ఖిలావరంగల్‌లో కీర్తితోరణం ఎదుట నిరసన తెలిపారు.

అవతరణ ఉత్సవాలకు రాలేను

సోనియా నిర్ణయం • గాంధీభవన్ వర్గాలు వెల్లడి

హైదరాబాద్, జూన్ 1 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ వేడుకలకు రాలేనని కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ చెప్పినట్లు గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి. ఎండ వేడిమి, అనారోగ్య కారణాలతో సోనియా రాలేకపోతున్నారని తెలిపాయి. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ వెళ్లి ఆమెను వేడుకలకు ఆహ్వానించారు. ఉత్సవాలకు రాలేకపోతున్నప్పటికీ తెలంగాణ ప్రజలకు సోనియా వీడియో సందేశం పంపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందేశాన్ని వేడుకల సమయంలో ప్రదర్శించనున్నారు.

తెలంగాణ రాష్ట్రం అమరుల త్యాగాల ఫలితం

దశాబ్ది అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం

హైదరాబాద్, జూన్ 1(నమస్తే తెలంగాణ): గవర్నర్ రాధాకృష్ణన్ ప్రజలకు తెలంగాణ రాష్ట్ర దశాబ్ది అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం త్యాగం చేసిన అమరులను స్మరించుకొన్నారు. వారి త్యాగాల ఫలితమే తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైందని పేర్కొన్నారు.

ప్రజా పాలనను అందిస్తాం: సీఎం రేవంత్‌రెడ్డి

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకలు జరుపుకొంటున్న సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న అన్ని వర్గాల వారికి అభినందనలు చెప్పారు. విభజన చట్టంప్రకారం ఇంతకాలం ఉమ్మడి రాజధానిగా ఉన్న హైదరాబాద్ ఇకపై తెలంగాణకే రాజధానిగా ఉంటుందని గుర్తు చేశారు.

ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్రం: భట్టి

రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క శుభాకాంక్షలు తెలిపారు. ఆకాంక్షలు, ఆలోచనల మేరకు సోనియాగాంధీ రాష్ట్ర ప్రజల చిరకాల కోరికను తీర్చారని గుర్తుచేశారు.

చిహ్నంపై ఏకాభిప్రాయం తప్పనిసరి

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, జూన్ 1: తెలంగాణ రాష్ట్ర గీతం, రాష్ట్ర చిహ్నంలపై ఏకాభిప్రాయం కుదిరాకే ప్రభుత్వం ఫైనల్ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి సూచించారు. శనివారం ఆయన సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. రేవంత్ సర్కార్ అవినీతి రహిత పాలన అందించాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. ఇప్పటికీ రోజూ అధికారులు ఏసీబీకి పట్టుబడటం దురదృష్టకరమని అన్నారు. రేవంత్ సర్కారుపై ప్రజలకు ఎన్నో ఆశలు ఉన్నాయని చెప్పారు.